బాబూ..మేమంటే నీకెందుకు చులకన?

- పేదలు, టిప్పర్ డ్రైవర్లు ఎన్నికల్లో నిలబడకూడదా ?
- ప్రతిపక్ష నేత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇంతియాజ్
- వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులతో కలిసి నిరసన


వైఎస్సార్‌సీ ట్రేడ్ యూనియన్ నాయకులతో కలిసి నిరసన తెలుపుతున్న ఇంతియాజ్


కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న ఎస్సీ విభాగం నాయకులు

కర్నూలు (టౌన్): ' మీకు ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీ వర్గాలు అంటే చులకన కదూ. అందుకే మీరు బడా పారిశ్రామికవేత్తలకు, పెత్తందార్లకే ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్లు ఇస్తారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న టిప్పర్ డ్రైవర్‌ను హేళన చేస్తూ మాట్లాడటం బట్టి పేదల పట్ల మీకున్న కుంచిత బుద్ధిని తెలియజేస్తుంద'ని టీడీపీ నేత చంద్రబాబుపై కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ మండిపడ్డారు. శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థిపై బాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ శనివారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులతో కలిసి స్థానిక నరసింగరావు పేటలోని పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో 25 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఎన్నికల్లో పోటీ చేయవచ్చన్నారు. ఇంత చిన్న విషయం మీకు తెలియదా బాబు అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు, ఉన్నత వర్గాల్లో పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. రాజకీయంగా వారికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దీనిని ప్రతిపక్ష నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు ఎంఏ, బీఈడీ చేసి టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జీవనోపాధి కోసం ఆయన చేస్తున్న పనిని ప్రతిపక్ష నేత కించపరుస్తూ మాట్లాడటం విచారకరమన్నారు. వెంటనే బాబు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేకపోతే ఈ ఎన్నికల్లో టిప్పర్ కింద సైకిల్ నలిగి పోవడం ఖాయమన్నారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి చంద్రబాబు

కల్లూరు: దళిత ద్రోహి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ అన్నారు. అనంతపురం జిల్లా శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థిగా టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారన్నారు. దళితుల ఎదుగుదలను ఓర్వలేని చంద్రబాబు వీరాంజనేయులును అవమానించేలా వ్యాఖ్యనించారన్నారు. బాబు తీరును నిరసిస్తూ శనివారం కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి ఆందోళన చేశారు. చంద్రబాబు దళిత ద్రోహి అంటూ నినాదాలు చేశారు. అనంతరం శివ మాట్లాడుతూ చంద్రబాబుకు ఎస్సీలంటే చులకన్నారు. ఉన్నత చదువులు చదివిన వీరాంజనేయులు కుటుంబ పోషణ కోసం టిప్పర్ నడపడం తప్పా? అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో ఎస్సీలందరూ కలిసి బాబును శాశ్వతంగా ఇంటికి పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం నాయకులు దాసరి మోహన్‌రాజు, రాజేష్, మనోరాజు, సురేష్, రాజు, గోపినాథ్, హుస్సేన్ సాహెబ్, బాషా, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటు హక్కును వినియోగించుకుందాం

కర్నూలు (టౌన్) : ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని స్వీప్ జిల్లా అధికారి రమణ పిలుపు నిచ్చారు. శనివారం స్వీప్ ఆధ్వర్యంలో స్థానిక కేడీఆర్ డిగ్రీ కళాశాల, నరసింహారెడ్డి నగర్, బంగారుపేట ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగంపై ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకొని ప్రచారం నిర్వహించారు. ఓటును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఏప్రిల్ 15 వ తేదీ లోపు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు.

ఓటు వేయడం మనందరి బాధ్యత

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక పాతబస్టాండ్ కొండారెడ్డిబురుజు వద్ద ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ పాల్గొన్నారు.

యాదవులను వంచించిన బాబు


మాట్లాడుతున్న అయ్యన్న యాదవ్

కర్నూలు (టౌన్) : రాయలసీమలో 18 శాతం జనాభా ఉన్న యాదవులకు ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా కేటాయించకుండా తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు వంచించడని రాష్ట్ర యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అయ్యన్న యాదవ్ మండిపడ్డారు. శనివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏముఖం పెట్టుకొని బాబు రాయలసీమలో ప్రచారం చేస్తున్నారో చెప్పాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో యాదవుల ఓట్లు 30 వేల వరకు ఉన్నాయన్నారు. సీటు ఇవ్వకుండా మోసం చేసిన బాబుకు వచ్చే ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పాలని యాదవులకు పిలుపునిచ్చారు.

2024-25లో కోటి పని దినాలు కల్పించాలి

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024-25లో కూలీలకు కోటి పని దినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోవాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి సిబ్బందికి ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయం నుంచి ఏపీడీలు, ఏపీఓలు తదితరులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. 2023-24లో 90 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం కాగా.. 99 లక్షలకుపైగా పని దినాలు కల్పించామని పేర్కొన్నారు. 2024-25 ఏప్రిల్ 1 నుంచి ఉపాధి కూలీల వేతనం రూ.272 నుంచి రూ.300కు పెరిగిందని, దీనిని రైతులు, రైతు కూలీల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. పెరిగిన వేతనాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు.

ఆర్‌యూ అకడమిక్ అఫైర్స్ డీన్‌గా భరత్‌కుమార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో పలు విభాగాలకు డీన్‌లను మార్చారు. పరిపాలనా సౌలభ్యంలో భాగంగా మార్పులు చేసినట్లు వర్సిటీ అధికారులు పేర్కొన్నారు. అకడమిక్ అఫైర్స్ డీన్‌గా ప్రొఫెసర్ భరత్‌కుమార్, లీగల్ సెల్ కో-ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ వెంకట సుదరానంద పుచ్చను నియమించారు. ఆర్‌యూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ డాక్టర్ ఎం.పి. నాగరాజును నియమించారు. ఈయనకు ఆర్‌యూ పరిధిలోని వర్సిటీ కళాశాలలతో పాటు డిగ్రీ, బీఈడీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్లను పర్యవేక్షించే బాధ్యతను అప్పగించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుధీర్ బి. ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌కు ఘన సన్మానం


నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకటతులశమ్మ దంపతులను సన్మానిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పదవీ విరమణ చేయనున్న నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ వన్ వెంకటతులశమ్మను శనివారం వైద్యులు, నర్సులు ఘనంగా సన్మానించారు. ఆసుపత్రిలోని ఓల్డ్ క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకటతులశమ్మ అందించిన సేవలను వక్తలు కొనియాడారు. ఆమె సుదీర్ఘకాలం ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సుగా, హెడ్‌నర్సుగా, నర్సింగ్ సూపర్‌వైజర్‌గా, నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సేవలందించారన్నారు. ఆమె సేవాదృక్పథాన్ని నర్సులు ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానందబాబు, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లు నాగమణి, సావిత్రిబాయి, హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

ఇంతియాజ్‌ను గెలిపించండి


లక్ష్మీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఇంతియాజ్, చిత్రంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ

కర్నూలు (టౌన్) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు నియోజకవర్గ అభ్యర్థి ఇంతియాజ్‌ను ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, పార్టీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ సంయుక్తంగా పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం స్థానిక 24వ వార్డులో ఇంతియాజ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక చిరు వ్యాపారులతో మాట్లాడారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత అందుతున్నాయా అని అడగగా తమకు అన్నీ అందుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదన్నారు. 14 సంవత్సరాల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు పేదల కోసం ఒక్క మంచి పథకం తీసుకోరాలేదన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిందన్నారు. ఇలాంటి మరెన్నో మంచి కార్యక్రమాలు జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పెత్తందారులకు ఊడిగం చేసే చంద్రబాబును ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇకపై స్కానింగ్ కేంద్రాల ఆకస్మిక తనిఖీలు


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఇకపై స్కానింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆన్‌లైన్‌లో స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం వచ్చిన దరఖాస్తులను కమిటీ ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. వీటిని జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సభ్యులు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ అధ్యర్యంలో జరిగే జిల్లా స్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ ఆమోదం కోసం పంపిస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆడపిల్లల ప్రాముఖ్యత, సరైన వివాహ వయస్సుపై అవగాహన కోసం ఎన్‌జీవోల సహాయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల్లోని డిగ్రీ, ఇంటర్, నర్సింగ్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, స్కానింగ్ కేంద్రాలపై సాధారణ తనిఖీలతో పాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కమిటి తీర్మానించినట్లు చెప్పారు. సమావేశంలో గైనకాలజీ హెచ్ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, పీడియాట్రిక్స్ హెచ్ఓడి డాక్టర్ విజయానందబాబు, రేడియాలజి హెచ్ఓడి డాక్టర్ రాధారాణి, గైనకాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నర్మద, డీఎస్‌వో డాక్టర్ నాగప్రసాద్, ఏపీపీ సుబ్బయ్య, డెమో ప్రమీలాదేవి, ఎన్‌జీవో ప్రతినిధులు కొమ్ముపాలెం శ్రీనివాసులు, ఎం. నాగరాజు, రాయపాటి శ్రీనివాసులు, హెచ్ఈఈఓ శ్రీనివాసులు, ఎస్ఓ హేమసుందరం పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ వేయాలి

అర్హులైన ప్రతి గర్భిణి, చిన్నారులందరికీ వ్యాక్సిన్లు వేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం స్థానిక కల్లూరు ఎస్టేట్‌లోని ముజఫర్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని సచివాలయంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడి గర్భిణులు, పిల్లలకు సంబంధించి ఆర్‌సీహెచ్ రికార్డులు, వ్యాక్సినేషన్ రికార్డులు పరిశీలించారు.

యువతను సన్మార్గంలో నడిపేందుకే రన్ ఫర్ జీసస్


నగరంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కర్నూలు (టౌన్): యువతను సన్మార్గంలో నడిపేందుకు నగరంలో అన్ని క్రైస్తవ సంఘాలను కలుపుకుని రన్ ఫర్ జీసస్ నిర్వహిస్తున్నట్లు రన్ ఫర్ జీసస్ ర్యాలీ, కమిటీ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ ఆర్.ఆర్.డి. సజీవరాజు అన్నారు. శనివారం ఈఎస్‌టీ (ఈవాంజిలికల్ సోల్జర్స్ టీమ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అన్ని సంఘాలకు చెందిన క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ఆర్ ఎస్ రోడ్డులోని రాక్‌వుడ్ చర్చి నుంచి మౌర్య ఇన్ సర్కిల్, రాజ్‌విహార్ సర్కిల్, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి, కలెక్టరేట్, గాయత్రి ఎస్టేట్, మద్దూరునగర్, సీ.క్యాంప్ సెంటర్ ప్రార్థన మందిరం వరకు సాగింది. ఈ సందర్భంగా చైర్మన్, కన్వీనర్ దాసరి సుధీర్ మాట్లాడుతూ ఏసు మరణం పునరుత్థానాన్ని లోకానికి చాటి చెప్పేందుకు రన్ ఫర్ జీసస్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్టాంటన్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన కొరియోగ్రఫీ క్రైస్తవులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి దాసు, హోసన్న మందిరం సంఘ కాపరి ఫ్రెడ్డీ పాల్, రాక్‌వుడ్ సంఘం అధ్యక్షుడు ఆనందరావు, కోల్స్ చర్చి అధ్యక్షుడు అబ్రహాంలింకన్, ప్రార్థన మందిరం అధ్యక్ష, కార్యదర్శులు బాస్కర్, సునీల్ కోల్స్ చర్చి సంఘం సంఘకాపరులు జీవన్, అనిల్‌కుమార్ శామ్యూల్, పాల్గొన్నారు.

డాక్టర్ రామచంద్రయ్య సేవలు ఎనలేనివి


డాక్టర్ రామచంద్రయ్య దంపతులను సత్కరిస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు, సిబ్బంది

కర్నూలు(అగ్రికల్చర్): దాదాపు 39 సంవత్సరాలు ఇటు రైతులకు, అటు మూగజీవులకు సేవలు అందించిన జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ పి.రామచంద్రయ్య నేడు పదవీవిరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఒక్క రోజు ముందుగా కొండారెడ్డి బురుజు సమీపంలోని బహుళార్ధ పశువైద్యశాలలో పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో డాక్టర్ పి.రామచంద్రయ్య సేవలు ఎనలేనివని జిల్లా అధికారులు, పశుసంవర్ధకశాఖ అధికారులు కొనియాడారు. మూగజీవుల ప్రాణాలు కాపాడి ఆయన ధన్యుడయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ సలీమ్‌బాష, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామల, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ ఎండీ విజేయుడు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు దుర్గాప్రసన్నబాబు, డాక్టర్ రాజశేఖర్, హేమంత్‌కుమార్, పీవీ రమణ, రమణమూర్తి, డీవి రమణయ్య, ఏడీలు భవానిశంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుభాన్‌బాష, పార్థసారధి, రామసుబ్బారెడ్డి, ధనుంజయులు తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

జిల్లా కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నియామకం

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉండవెల్లి వెంకటన్నను నియమించారు. ఈ మేరకు శనివారం ఆయనకు డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు నియామక పత్రం అందజేశారు.

నేడు 'గమాగో ఆత్మకథ' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిస్వార్థ దేశ భక్తుడు గమాగో ఆత్మకథ ' విస్తృత కార్యకర్త ' పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అరసం సభ్యులు తెలిపారు. రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామాంజనేయులు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పాల్గొని పుస్తకావిష్కరణ చేస్తారన్నారు.

4 నుంచి ఈతకొలను ప్రారంభం

కర్నూలు (టౌన్): వచ్చే నెల 4 వ తేదీ నుంచి స్పోర్ట్స్ అథారిటీకి చెందిన స్విమ్మింగ్‌పూల్ (ఈత కొలను) ప్రారంభిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈత కోలనులో సభ్యత్వం పొందేందుకు 6 సంవత్సరాల వయస్సు పూర్తి అయి ఉండాలని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తుల కోసం స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు అలాగే సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు సంప్రదించాలని తెలిపారు. ముందుగా వచ్చిన వారికి తొలి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కర్నూలు : కర్నూలు బళ్లారి చౌరస్తా ఫ్లై ఓ వర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్లూరులోని రామకృష్ణనగర్‌కు చెందిన మణికుమార్ (29) మృతి చెందాడు. మణికుమార్ అతని స్నేహితుడు శివతో కలసి శుక్రవారం అర్ధరాత్రి బుల్లెట్ వాహనంపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా ఇంటికి వెళ్తుండగా మినీ లారీ అసోసియేషన్ కార్యాలయం ఎదురుగా బ్రేక్ డౌన్ అయి ఆగివున్న లారీని ఢీకొట్టాడు. బైక్ నడుపుతున్న మణికుమార్, వెనుక కూర్చున్న శివకు రక్తగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి 108 అంబులెన్స్‌లో ఇరువురిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్ పరిశీలించి మణికుమార్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. శివకుమార్ మాత్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ట్రాఫిక్ సీఐ గౌతమి తెలిపారు.

ఆర్‌యూ ఉద్యోగికి విధుల నుంచి రిలీవ్

కర్నూలు కల్చరల్: రాయలసీమ వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, వర్సిటీ పీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న సురేంద్రబాబును శనివారం విధుల నుంచి రిలీవ్ చేశారు. ఈయన కాంట్రాక్ట్ విధానంలో ఆఫీస్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ జూనియర్ అసిస్టెంట్‌గా రెగ్యులర్ ఉద్యోగిగా మారారు. అయితే, కొందరు ఆయన కాంట్రాక్ట్ నుంచి రెగ్యులర్ పోస్టులోకి మారడం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ఈసీలో ర్యాటిఫికేషన్ కాలేదని వర్సిటీ ఉన్నతాధికారులకు, ఉన్నత విద్యా మండలికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. రెగ్యులర్ ఉద్యోగి పదవీ విరణమ వయస్సు 62 సంవత్సరాలు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు 60 సంవత్సరాలు. దీనిపై విచారించిన వర్సిటీ ఉన్నతాధికారులు సదరు ఉద్యోగి రెగ్యులర్ కాలేదని ఉన్నత విద్యా మండలి నుంచి క్లారిఫికేషన్ తీసుకున్నారు. దీంతో సురేంద్రబాబును జూనియర్ అసిస్టెంట్ నుంచి ఆఫీస్ అసిస్టెంట్‌గా రివర్సన్ ఇచ్చి విధుల నుంచి రిలీవ్ చేశారు. దీనిపై వర్సిటీ రిజిస్ట్రార్ నాగుల అంకన్న మాట్లాడుతూ వీసీ ఆదేశాల మేరకు నిబంధనలు అనుసరించి విధుల నుంచి రిలీవ్ చేశామని పేర్కొన్నారు.

వేద విద్యా నిలయం నిర్మాణానికి భూమి పూజ


వేద విద్యాలయం నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ఆచార్య మేడూరి దీక్షితుల వెంకట సుబ్బయ్య, స్మారక వేద విద్యా నిలయం నిర్మాణానికి స్థానిక వెంకటరమణ కాలనీలో శనివారం భూమి పూజ జరిగింది. అఖిలభారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యన్నదాన సత్రం, మేడూరి వారి తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమాన్ని ఉడిపి పలిమారు పీఠాధిపతి 1008 శ్రీ విద్యాధీశ స్వామి, ఉత్తరాధికారి 1008 శ్రీ విద్యా రాజేశ్వర తీర్థ స్వామీజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాదీశ స్వామి మాట్లాడుతూ దైవం ఉనికి తెలిసేది వేదం వల్లనే అన్నారు. విద్యాదానం శాశ్వతమని అలాంటి కార్యక్రమం కరివేన సత్రం నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలుగు సాహితీ సమితి అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ స్థలం సేకరించిన మేడూరి దీక్షితుల వెంకట సుబ్బయ్య, ఉప్పలూరి మల్లికార్జున శాస్త్రి, పండుగ సుబ్బారెడ్డిల సంకల్పం కార్య రూపం కావడం శుభపరిణామన్నారు. అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, వేదపాఠశాల కరస్పాండెంట్ చిదంబరరావు, కరివేన సత్రం కార్యవర్గ సభ్యులు హెచ్‌కే మనోహరరావు, పి.హరినాథ శర్మ, వర్కింగ్ కమిటీ సభ్యులు హెచ్‌కే రాజశేఖర్‌రావు, సాహితీ వేత్తలు, విద్యావేత్తలు, పాల్గొన్నారు. అంతకు ముందు స్వామీజీలు స్థానిక సంకల్ బాగ్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. ఓల్డ్ సిటీలోని వేద పాఠశాలను సందర్శించి వేద విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అధ్యయనం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, చిరుధాన్యాల వినియోగం తదితర వాటిపై గరిమా గోయల్ అనే యువతి మూడు రోజుల ప్రాజెక్టు వర్క్ కింద అధ్యయనం చేశారు. హైదరాబాద్‌లోని కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీలో మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ చేస్తున్న గరిమా గోయల్ చివరి ఏడాదిలో ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా అధ్యయం చేస్తున్న ఆమె ఓర్వకల్ మండలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో గురు, శుక్రవారాల్లో ముఖాముఖి అయ్యారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు అయిన మిల్లెట్ కేఫ్‌ను సందర్శించారు. మిల్లెట్ కేఫ్‌లో చిరుధాన్యాల వినియోగంపై వేణుబాబుతో చర్చించారు. కేవలం చిరుధాన్యాలకు సంబంధించి ప్రత్యేకంగా మిల్లెట్ కేఫ్ ఏర్పాటు చేయడం, ఇందుకు జిల్లా యంత్రాంగం సహకరించడం శుభపరిణామమని పేరొన్నారు. సి.క్యాంపు రైతుబజారులో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలించారు. కెమికల్ లేకుండా పండించిన పంటలకు మార్కెట్‌లో లభిస్తున్న డిమాండ్‌ను ఆరాతీశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మల్లికార్జున తదితరులు ఆమె వెంట ఉండి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: జిల్లాలోని 16 ఏపీ మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ కాగిత శామ్యూల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ మండలానికి చెందిన విద్యార్థులు ఆ మండలంలో ఉండే స్కూళ్లలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు ఏప్రిల్ 6వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

పాలీసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షకు ఏప్రిల్ 1వ తేది నుంచి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జి.పుల్లారెడ్డి పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఎంవీఎస్ఎస్ఎన్ ప్రసాద్, ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎ.చక్రవర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ ఏప్రిల్ 25వ తేదీ వరకు ఉంటుందని హాజరైన విద్యార్థులందరికీ మెటీరియల్ ఉచితంగా ఇస్తామన్నారు.

ప్రతిపక్షాలకు గుణపాఠం చెప్పండి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


కల్లూరు అర్బన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో పేదప్రజలకు ఎంతో మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు జతకట్టిన ప్రతిపక్షాలను ఓటుతో బుద్ధి చెప్పాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం కల్లూరు అర్బన్ 36వ వార్డులోని గురు బ్రహ్మనగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ అవ్వాతాతలను, మహిళలను, ప్రజలను అప్యాయంగా పలకరిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు అధికారం కోసం మాయ మాటలు చెబుతారని వారిని నమ్మొద్దన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత జగన్ పాలనకు మధ్య గల తేడాను గమనించాలన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి పథకం ఇంటి వద్దకే వచ్చిందన్నారు. అర్హతే ప్రామాణికంగా అందించామన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన జగనన్నను మరో మారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కల్లూరు అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, వార్డులలోని స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

బైపోలార్ వ్యాధిపై అవగాహన పెరగాలి

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో బైపోలార్ డిజార్డర్‌పై అవగాహన పెరగాలని ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. ప్రపంచ బైపోలార్ డేను పురస్కరించుకుని శనివారం పెంచికలపాడు సమీపంలోని విశ్వభారతి వైద్య కళాశాలలో మనోరోగ చికిత్స విభాగం ఆధ్వర్యంలో మెడికోలు, పీజీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ బైపోలార్ అనారోగ్యం గురించి వివక్షను తగ్గించేందుకు, చికిత్స తీసుకునేందుకు రోగులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం మార్చి 30వ తేదీన బైపోలార్ డేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన దేశంలో దాదాపు 40-45లక్షల మంది రోగులు ఈ వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మునీరుద్దీన్ అహ్మద్, సైకియాట్రి విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ శివశంకర్‌రెడ్డి, సీనియర్ రెసిడెంట్లు డాక్టర్ అబూజార్ రహిమాన్, డాక్టర్ వీరేంద్ర పాల్గొన్నారు.

నేడు విద్యార్థుల తల్లిదండ్రులకు వర్క్ షాప్

కల్లూరు: కర్నూలు నగరంలోని హోటల్ ఫ్రేమ్‌ల్యాండ్, రైల్వే స్టేషన్ ప్రాంగణం వద్ద ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సారథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదివారం వర్క్ షాప్ నిర్వహించనున్నారు. ప్రముఖ విద్యావేత్త ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కర్నూలు ప్రధాన సలహాదారు మండవ ప్రసన్న, ప్రజ్ఞాశాలి సుమితా భట్టాచార్య హాజరుకానున్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నట్లు స్కూల్ యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.